క్లుప్తంగా

కృష్ణాలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు



భజన చేస్తున్న భక్తులు, చిన్నారులు

మల్కాపురం: స్థానిక యాదవవీధిలోని కృష్ణాలయంలో శనివారం సాయంత్రం లలిత పారాయణం, శ్రీకృష్ణ నామాలతో భజన కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ విజ్ఞాన మండలి యాదవ సంఘం ప్రతినిధుల ఆధ్వర్యంలో ముందు ఇక్కడ కొలువు దీరిన శ్రీకృష్ణుడికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. తులసి,సుగంధ పుష్పాలతో అలంకరించారు. అనంతరం పలువురు మహిళలు లలిత పారాయణం పఠించారు. చిన్నారులు శ్రీకృష్ణుడి భజన చేపట్టారు. కార్యక్రమంలో యాదవ సంఘం పెద్దలు,పాలక వర్గ ప్రతినిధులు,సభ్యులు,సలహాదారులు పాల్గొన్నారు.

నేలబావిని పరిశీలించిన కార్పొరేటర్



నేలబావి సమస్యను తెలుసుకుంటున్న కార్పొరేటర్ కొణతాల సుధ

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గొల్లవీధి వద్ద నిరుపయోగంగా ఉన్న నేలబావిని వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ శనివారం పరిశీలించారు. ఈ బావిలో నీటిని ఎవరూ వినియోగించకపోవడంతో నాచు పట్టి, వ్యర్థాలతో నిండిపోయి ఉంది.పైన రక్షణ కవచంగా ఏర్పాటు చేసినా పైకప్పు కూడా తుప్పు పట్టి ప్రమాదకరంగా మారింది. దీంతో సమస్యను స్థానిక విజ్ఞాన మండలియాదవ సంఘం ప్రతినిధులు వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ దృష్టికి తీసుకువెళ్లారు.దీనిపై స్పందించిన కార్పొరేటర్ వాటర్ సప్లై ఏఈ కనకరాజుతో కలిసి సమస్యను పరిశీలించారు. వెంటనే బావిలో వ్యర్థాలతో పాటు నీటిని తొలగించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



డాక్టర్ చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న కళాశాల చైర్మన్ సత్యనారాయణ తదితరులు

గోపాలపట్నం: విద్యార్థులు భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఏపీసీటీఈ చీఫ్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్ అన్నారు. నరవలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శనివారం నిర్వహించిన సెమినార్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు టెక్నికల్ విద్యలో ప్రాక్టికల్ నాలెడ్జ్ ఎంతో అవసరమన్నారు. అలాగే కమ్యూనికేషన్ స్కిల్స్ కూడా అభివృద్ధికి దోహదపడతాయని చెప్పారు. కంప్యూటర్ కోర్స్ చదువుకునే విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై దృష్టిపెట్టాలని సూచించారు. అనంతరం కళాశాల చైర్మన్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డాక్టర్ వి. శ్రీధర్ పట్నాయక్ ఆయన్న ఘనంగా సత్కరించారు.

25న రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జేఏసీ సమావేశం

డాబాగార్డెన్స్: ఏపీ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జేఏసీ, ఈపీడీసీఎల్ డిస్కం కార్యవర్గ సమావేశం ఈ నెల 25న విశాఖలో గల వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించనున్నట్టు జేఏసీ చైర్మన్ వీఎస్ఆర్‌కే గణపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి నిర్వహించనున్న సమావేశానికి ఏపీ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ కేంద్ర కార్యవర్గ ముఖ్య నాయకులు పాల్గొంటున్నట్టు తెలిపారు. డిస్కం పరిధిలో గల అన్ని కార్మిక సంఘాలు, అసోసియేషన్లు, డిస్కం ముఖ్య ప్రతినిధులు, జేఏసీ కార్యవర్గ సభ్యులు పాల్గొనాలని కోరారు.

వైద్య సేవలు భేష్

- ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన సేవలు
- అందుబాటులో అన్ని రకాల వైద్య పరీక్షలు

గోపాలపట్నం: జీవీఎంసీ 89, 90, 92 వార్డుల్లో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సేవలు చాలా బాగున్నాయి. స్థానిక ప్రజలకు వైద్యులు అందుబాటులో ఉంటూ అన్ని రకాల వైద్య సేవలు అందజేస్తున్నారు. ఆరోగ్య పరిరక్షణకు తగు సలహాలు, సూచనలిస్తున్నారు.

- 90వ వార్డు ఎన్ఏడీ బుచ్చిరాజుపాలెంలోని ఆరోగ్య కేంద్రానికి ప్రతి రోజూ సుమారు 70 మందికి పైగా రోగులు వస్తున్నారు. వీరు ప్రధానంగా జ్వరం, బీపీ, సుగర్ వంటి వ్యాధులతో బాధపడుతున్నారు. సంబంధిత వైద్యులను సంప్రదిస్తూ అవసరమైన ఆరోగ్య సేవలు పొందుతున్నారు. ఈ ఆస్పత్రి మూడు గదుల్లో నడుస్తోంది. ఇక్కడున్న 'మీ సేవా' గదిని అందుబాటులోకి తీసుకొస్తే అత్యవసర పరిస్థితిల్లో సిలైన్ ఎక్కించేందుకు, బెడ్లు వేసేందుకు అవకాశముంటుందని స్థానికులు సూచిస్తున్నారు. జీవీఎంసీ అధికారులు ఈ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
- 89వ వార్డు చంద్రనగర్‌లోని ఆరోగ్య కేంద్రం కోసం కొత్తగా భవనం నిర్మిస్తున్నారు. ప్రస్తుతానికి ఈ ఆస్పత్రికి సంబంధించిన వైద్య సేవలు బుచ్చిరాజుపాలెం ఆరోగ్య కేంద్రంలో కొనసాగిస్తున్నారు. ఈ హెల్త్ సెంటర్‌లోనే వైద్యాధికారులు ఇద్దరూ విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ 62 రకాల వైద్య పరీక్షలు, 172 రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. మందుల కొరత లేదు. రెండు ఆస్పత్రులకు సంబంధించి 14 మంది వైద్య సిబ్బంది పని చేస్తున్నారు.
- 92వ వార్డు గోపాలపట్నం లక్ష్మీనగర్ ఆరోగ్య కేంద్రంలో ప్రతి రోజూ సుమారు 45 మంది రోగులు వైద్య సేవలు పొందుతున్నారు. ఇక్కడ 63 రకాల వైద్య పరీక్షలు, 116 రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. ప్రత్యేకంగా బెడ్స్ ఉండటం వల్ల రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నారు. స్థానికంగా మందుబాబుల బెడద ఎక్కువగా ఉండటం వల్ల సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. దీనిపై పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



బుచ్చిరాజుపాలెంలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం

ఉచితంగా వైద్య పరీక్షలు



బుచ్చిరాజుపాలెం ఆరోగ్య కేంద్రంలో మంచి వైద్య సలహాలు, సూచనలు ఇస్తున్నారు. రోగులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇస్తున్నారు. వైద్యుల సేవలు బాగున్నాయి.

– టైసన్, ఎన్ఏడీ జంక్షన్

మర్యాదగా ప్రవర్తిస్తున్నారు



బుచ్చిరాజుపాలెం హెల్త్ సెంటర్‌కు వచ్చే రోగులు, వారి సహాయకులతో వైద్య సిబ్బంది మర్యాదగా నడుచుకుంటున్నారు. వైద్యాధికారి దీపిక చక్కని సేవలు అందిస్తున్నారు. అన్ని రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు.

– కామేష్, బుచ్చిరాజుపాలెం

అభివృద్ధి పనుల పరిశీలన



శాంతినగర్‌లో రోడ్డు పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డులోని పలు ప్రాంతాల్లో శనివారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో సమస్యలపై ఆరా తీశారు. శాంతినగర్, మర్రిపాలెం వుడా లేఅవుట్, గౌరీనగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. మర్రిపాలెం వుడా లేఅవుట్ 80 అడుగుల రహదారి డివైడర్ పనులను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.శాంతినగర్‌లోని అన్ని వీధుల్లో బీటీ రోడ్లు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.జాతీయ రహదారిలో మరుగుదొడ్ల నిర్మాణం జాప్యం లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే జిందాల్ భవనం వద్ద గ్రీన్ బెల్టులో వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఈ నిర్మాణం ఏవిధంగా చేయాలి, ఏఏ పరికరాలు ఇక్కడ ఏర్పాటు చేయాలన్న అంశాలపై అధికారులతో చర్చించారు. హిందూ క్రిస్టియన్ ముస్లిం శ్మశాన వాటిక ఆధునికీకరణ, గ్రీనరీ, మంచినీటి సౌకర్యం వంటి పనులను పరిశీలించారు. కొత్త కరాసా, పాత కరాసాలో అన్ని వీధుల్లో బీటీ రోడ్లు, సీసీ రోడ్లు వేయాలని అధికారులకు సూచించారు. నిధులు మంజూరు అయిన నేపథ్యంలో వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. గౌరీనగర్, గణేష్‌నగర్ ప్రాంతాల్లో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్లను పరిశీలించారు. ఆయనతో పాటు డీఈ ఏడు కొండలు, ఏఈ ఉష, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా ఓటరు సర్వే



ఓటరు సర్వేను పరిశీలిస్తున్న 62వ వార్డు కార్పొరేటర్ లక్ష్మణరావు

సింథియా: తప్పులు లేని ఓటరు జాబితా సిద్ధం చేయాలనే లక్ష్యంతో ఎలక్షన్ కమిషన్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం నియోజకవర్గంలో ఓటరు సర్వే చురుగ్గా సాగుతోంది. బీఎల్‌వోలు, బీఎల్ఏలతో పాటు రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా సర్వేలో పాల్గొంటున్నారు. ఇంటింటికీ వెళ్లి ఓటరు వివరాలు సేకరించడంతో పాటు చనిపోయిన వారు, శాశ్వత వలస వెళ్లిన వారు ఉన్నారా అనే అంశాలపై ఆరా తీస్తున్నారు. 18 ఏళ్ల నిండిన వారి నుంచి ఓటు నమోదుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

- జీవీఎంసీ 62వ వార్డు పరిధి త్రినాథపురంలో సచివాయల సిబ్బంది, బీఎల్‌వోలు చేపడుతున్న ఓటరు సర్వేను శనివారం వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ దొంగ ఓట్లకు చరమ గీతం పాడే సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో సచివాలయ అధికారి జి.శ్రీనివాసరావు, బీఎల్ఏలు ఎస్.సత్యనారాయణ, బి.సూర్యనారాయణ, బి.మధు తదితరులు పాల్గొన్నారు.

40వ వార్డులో..

జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీకాలనీలోని 161, 164 బూత్ నంబర్లలో ఓటరు సర్వే చురుగ్గా కొనసాగుతుంది. ఓటరు సర్వేను వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు పాల్గొని పరిశీలించారు. కార్యక్రమంలో బీఎల్ఏలు మహేష్, బాలకృష్ణ, గంగరాజు, బాలప్రసాద్, బైరాగి తదితరులు పాల్గొన్నారు.

61వ వార్డులో..

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు జనతా కాలనీలో ఓటరు సర్వే శనివారం నిర్వహించారు. బీఎల్ఏలు ,బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి కొత్తగా ఓటర్ కార్డు పొందాలనుకునే వారి వివరాలు, ఆ ఇంట్లో ఓటరు లేకపోవడం, మృతి చెందడం,లేదా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడం వంటి వివరాలు సేకరించారు.

వెంకన్న ఆలయాల్లో విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో సంపత్ వేంకటేశ్వర స్వామి



కలియుగ వెంకన్నను దర్శించుకుంటున్న భక్తులు

కంచరపాలెం: అధిక శ్రావణ మాస శుద్ధ చవితి సందర్భంగా శనివారం వెంకన్న ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. గొల్లకంచరపాలెం కోదండ సీతారామ, ధన లక్ష్మీదేవి, సంపత్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు శ్యామాచార్యులు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేశారు. శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం నక్షత్ర హారతి, భక్తి సంకీర్తన, పవలింపు సేవ నిర్వహించారు.

– తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, అర్చనలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

కోలా గురువులుకు అభినందనలు



కోలా గురువులును సత్కరిస్తున్న మళ్ల ధనలత

మల్కాపురం: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కోలా గురువులును శనివారం పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. కోలా గురువులు పార్టీ కార్యాలయం వద్ద కనక మహాలక్ష్మి దేవస్థానం ట్రస్టు బోర్డు మెంబర్ మళ్ల ధనలత, పార్టీ నాయకులు రవి,అనుదీప్ తదితరులు ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు షిప్‌యార్డ్‌కాలనీలోని జీవీఎంసీ స్కూల్‌లో శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి ఆధ్వర్యంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు వస్తున్నాయన్నారు. కార్పొరేటర్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను మార్చి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందన్నారు. రాగి జావ, మధ్యాహ్నం భోజనం పరిశీలించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు మూర్తి, హరినాథ్, రామకృష్ణ, మల్లికార్జున, విజయకుమారి, ఉషాకిరణ్, శాంతికుమారి, సచివాలయ కన్వీనర్ మీసాల సత్యనారాయణ, నాయకులు నూనెల బాలప్రసాద్, గల్లా వెంకటేష్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్క్ అభివృద్ధి పనులపై సమీక్ష



సీతారామరాజునగర్ పార్క్‌లో గ్రీనరీ అభివృద్ధి గురించి చర్చిస్తున్న అధికారులు

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు సీతారామరాజునగర్ పార్క్ అభివృద్ధి పనులను వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ, ఏడీహెచ్ దామోదర్ శనివారం పరిశీలిచారు. పార్క్‌లో గ్రీనరీని ఏవిధంగా అభివృద్ధి చేయాలో చర్చించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ పార్క్ అభివృద్ధికి జీవీఎంసీ నిధులు రూ.34.56 లక్షలు వెచ్చిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీతారామరాజునగర్ కాలనీ అధ్యక్షుడు శ్రీనివాసరాజు, స్థానికులు పాల్గొన్నారు.

సెయింట్ పీటర్స్ చర్చిలో ఎపిస్కోపల్ ఉత్సవాలు



వేడుకల్లో రెవరెండ్ ఫాదర్ మల్లవరపు ప్రకాశ్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ చర్చిలో శనివారం రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్ నేతృత్వంలో ఎపిస్కోపల్ సిల్వర్ జూబ్లీ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. విశాఖ ఆర్చి బిషప్ రెవరెండ్ ఫాదర్ మల్లవరపు ప్రకాశ్ బిషప్‌గా 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ఉత్సవాలు నిర్వహించారు. విశాఖలో గల మత గురువులు, కన్య స్త్రీలు, క్రైస్తవ సోదరులు దివ్యబలి పూజలు సమర్పించారు. ముందుగా బిషప్ మల్లవరపు ప్రకాశ్‌ను జ్ఞానాపురం వీధుల్లో ఊరేగింపుగా వేదిక వద్దకు తీసుకెళ్లారు. యావత్ విశాఖకే కాకుండా ఇక్కడి క్రైస్తవ ప్రజలకు కాపరిగా ఆయన చేస్తున్న సేవలను కొనియాడుతూ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు కృపతో క్రైస్తవ ప్రజలకు సేవ చేసే భాగ్యం దొరకడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మత గురువులు, కన్య స్త్రీలు, క్రైస్తవ సోదరులు, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

విశాఖ వ్యాలీ ప్రిన్సిపాల్‌కు ఐకానిక్ అవార్డు



ఐకానిక్ లీడర్‌షిప్ అవార్డు అందుకొంటున్న విశాఖ వ్యాలీ ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్

అరిలోవ: విశాఖ వ్యాలీ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్‌కు ఐకానిక్ లీడర్‌షిప్ ఇన్ స్కూల్ ఎడ్యుకేషన్ అవార్డు–2023 లభించింది. న్యూఢిల్లీలో శనివారం జరిగిన న్యూ నార్మల్ ఎడ్యుకేషన్ లీడర్‌షిప్ సమ్మిట్–2023 కార్యక్రమంలో ఎన్‌సీఈఆర్‌టీ కార్యదర్శి ప్రొఫెసర్ ప్రత్యూషకుమార్, స్కిల్ ఎడ్యుకేషన్ సీబీఎస్ఈ డైరెక్టర్ డాక్టర్ బిశ్వాజిత్ సాహు, ఎన్‌సీఈఆర్‌టీ పీబీ డివిజన్ హెడ్ డాక్టర్ అనూప్‌కుమార్ తదితరుల సమక్షంలో ఆమె అవార్డు స్వీకరించారు. ఈ సందర్భంగా ఈశ్వరి ప్రభాకర్ మాట్లాడుతూ విలువలతో కూడిన విద్య విధానం అమలు చేస్తున్నందుకు తనకు ఈ అవార్డు లభించినట్లు తెలిపారు.

ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలు

మర్రిపాలెం: ఆటో ఢీకొని ఓ వ్యక్తికి గాయాలైన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఎన్ఏడీ కొత్త రోడ్డు సమీపంలో నివసిస్తున్న సిహెచ్. వెంకటరమణ పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం కంచరపాలెం మెట్టు మీదుగా తాటిచెట్లపాలెం రోడ్డు నుంచి బైకుపై వెళ్తుండగా అదే రోడ్డులో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో అతడికి గాయాలయ్యాయి. కుడి చేతికి ఫ్రాక్చర్ అయ్యింది. క్షతగాత్రుడు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కంచరపాలెం సీఐ ఎస్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ రమేష్‌రెడ్డి కేసు దర్యాప్తు చేపట్టారు.

ఏఎన్ 32 విమాన ప్రమాద మృతులకు నివాళి



ఎన్ఏడీలో మొక్కలు నాటుతున్న ఎన్ఏసీఎస్ అండ్ డబ్ల్యూ యూనియన్ నాయకులు

గోపాలపట్నం: ఏఎన్ 32 విమాన ప్రమాదంలో మృతి చెందిన ఎన్ఏడీ కార్మికులకు శనివారం ఎన్ఏడీ నేవల్ ఆర్మెంట్ సివిలియన్ స్టాఫ్ అండ్ వర్కర్స్ (ఎన్ఏసీఎస్ అండ్ డబ్ల్యూ) యూనియన్ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేవల్ ఆర్మమెంట్ డిపో(ఎన్ఏడీ)లో యూనియన్ నాయకులు వారి జ్ఞాపకార్థం మొక్కలు నాటారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి సాలాపు మారయ్య మాట్లాడుతూ దేశ రక్షణలో భాగంగా తాంబరం ఎయిర్‌పోర్టు నుంచి అండమాన్ వెళ్తున్న సమయంలో ఏఎన్32 విమానం గల్లంతయిందని తెలిపారు. ఆ దుర్ఘటనలో ఏడు మంది కార్మికులు మృత్యువాత పడ్డారన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఉక్కు రిటైర్డ్ అధికారులకు మెడికల్ స్కీమ్‌పై ఆప్షన్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పదవీ విరమణ అధికారుల మెడికల్ స్కీమ్‌పై యాజమాన్యం ఆప్షన్ ఇచ్చింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. స్టీల్‌ప్లాంట్ నుంచి 2017 తర్వాత పదవీ విరమణ చేసిన అధికారులకు మొదట్లో గ్రూప్ మెడికల్ ఇన్సూరెన్స్ స్కీమ్ ఉండేది. ఆ స్కీమ్‌లో మార్పులు చేస్తూ పోస్టు రిటైర్‌మెంట్ మెడికల్ స్కీమ్ (పీఆర్ఎంఎస్) పేరిట ఉక్కు యాజమాన్యం కొత్త స్కీమ్ ప్రవేశపెట్టింది. కొత్త స్కీమ్ పదవీ విరమణ అధికారులకు నష్టదాయకమని, పాత విధానాన్ని కొనసాగించాలని వారు యాజమాన్యాన్ని అభ్యర్థించారు. యాజమాన్యం నుంచి స్పందన రాకపోవడంతో విశ్రాంత అధికారుల సంఘం హైకోర్టును ఆశ్రయించింది. స్కీమ్ ఎంపికపై ఆప్షన్ ఇవ్వాలంటూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో యాజమాన్యం ఆప్షన్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వులపై ఉక్కు విశ్రాంత అధికారుల సంఘం అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు హర్షం ప్రకటించారు.

29న గర్భిణులకు ప్రత్యేక యోగా శిబిరం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం, కృష్ణా హెల్త్ సెంటర్ సంయుక్తంగా ఈ నెల 29న గర్భిణులకు ప్రత్యేకంగా యోగా వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు విభాగాధిపతి ఆచార్య కె.రమేష్ బాబు తెలిపారు. వర్క్‌షాపులో భాగంగా కృష్ణా హాస్పిటల్ వైద్యుడు డాక్టర్ వి.రఘురామ కృష్ణంరాజు పాల్గొని సూచనలిస్తారని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు ముందుగా తమ పేర్లు 91008 55823 నంబర్‌కు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలన్నారు.

ఏయూను సందర్శించిన ఆర్పీ పట్నాయక్

మ్యూజిక్ కోర్సుల పరిశీలన



సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్‌ను సత్కరిస్తున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సినీ సంగీత దర్శకుడు ఆర్.పి. పట్నాయక్ శనివారం సందర్శించారు. ఏయూలో తాను చదువుకున్న రోజులు, వర్సిటీ హాస్టల్స్‌లో గడిపిన సమయం, ఏయూలో నిర్వహించిన సాంస్కృతిక సమ్మేళనంలో పాల్గొన్న రోజులను ఆయన గుర్తు చేసుకున్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సినీ సంగీత రంగానికి నిపుణులను అందించే విధంగా వర్సిటీలో నిర్వహిస్తున్న సౌండ్ ఇంజినీరింగ్ కోర్సులు, నూతనంగా ఏర్పాటు చేసిన డీజీఎస్ స్టూడియో తదితర అంశాలను రిజిస్ట్రార్ ఆయనకు వివరించారు. వర్సిటీ తరఫున ఆర్.పి. పట్నాయక్‌ను సత్కరించారు. కార్యక్రమంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షుడు ఆచార్య ఎన్.ఏ.డి. పాల్, కార్యదర్శి నరవ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

జూలో పిల్లల పార్కులు



పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆట పరికరాలు

అరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో పిల్లల కోసం ప్రత్యేకంగా రెండు చోట్ల పార్కులు సిద్ధం చేశారు. సీతాకోక చిలుకల పార్కు పక్కన ఒకటి, నెమళ్ల జోన్ సమీపం, కనుజుల ఎన్‌క్లోజర్ ఎదురుగా మరొకటి సిద్ధ ం చేసి.. పిల్లలు ఆడుకునేందుకు వీలుగా జారుడు బల్లలు, ఊయలలు, రంగుల రాట్నాలు, తల్లిదండ్రులు సేదతీరడానికి సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. జూకు వచ్చే పిల్లలు వన్యప్రాణులను చూసి ఆనందించడంతో పాటు ఆటలాడుతూ సరదాగా గడపవచ్చు. అలాగే కనుజుల ఎన్‌క్లోజర్ ఎదురుగా పిల్లల పార్కులో మినీ కేఫ్‌టేరియా నిర్మించారు. దీన్ని జూ సిబ్బందే నిర్వహిస్తున్నారు. ఇక్కడ తినుబండారాలను విక్రయిస్తున్నారు.

'కేంద్రంపై ఒత్తిడి తెస్తాం'

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 891వ రోజు శనివారం కాంగ్రెస్ నాయకులు, సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ మోదీ పాలనలో ప్రభుత్వ రంగం కుదేలైందన్నారు. ప్లాంట్‌కు చెందిన భూమిని రియల్ ఎస్టేట్‌గా మార్చేందుకు ప్రభుత్వం చూస్తోందన్నారు. వచ్చే నెలలో రాహుల్ గాంధీ రాష్ట్రానికి వచ్చి స్టీల్‌ప్లాంట్ కార్మికుల దీక్షకు సంఘీభావం తెలుపుతారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాకేష్‌రెడ్డి, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు గొంప గోవింద్, సుంకర పద్మశ్రీ పాల్గొన్నారు.

విద్యార్థులకు సెమిస్టర్ పుస్తకాల అందజేత

ఏయూక్యాంపస్: పాఠశాల విద్యాశాఖ అందించిన పాఠ్యపుస్తకాల పంపిణీని కలెక్టర్ ఎ.మల్లికార్జున శనివారం ప్రారంభించారు. శివాజీపాలెంలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి పిల్లలకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రగతిని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. విద్యార్థుల వర్క్‌బుక్స్, ప్రభుత్వం ప్రవేశపెట్టిన టోఫెల్ టీచింగ్ పరిశీలించారు. కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు ఉత్సాహంగా సమాధానమిచ్చారు. విద్యార్థులను తీర్చిదిద్దుతున్న విధానంపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేస్తూ, పాఠశాల ప్రధానోపాధ్యాయిని, ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాల వేళల్లోనే కాకుండా ఖాళీ సమయాలలోను రోజూ అదనపు తరగతులు నిర్వహించడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఇతర పాఠశాలల్లో ఈ విధానం అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయ కర్త బి.శ్రీనివాసరావు, ఎంఈవో రామారావు, బాలా మణి పాల్గొన్నారు.

100 మీటర్ల జాతీయ జెండా ప్రదర్శన



100 మీటర్ల జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న సంతపాలెం పాఠశాల విద్యార్థులు

అరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు పరిధి సంతపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శనివారం 100 మీటర్ల జాతీయ జెండాతో ప్రదర్శన చేపట్టారు. భారతీయ పతాక ఆమోద దినోత్సవం సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సిరికి శ్రీనివాసరావు మాట్లాడుతూ పింగళి వెంకయ్య రూపొందించిన త్రివర్ణ పతాకాన్ని 1947 జూలై 22న రాజ్యాంగ పరిషత్ ఆమోదించిందన్నారు. జాతీయ పతాకం గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు వెల్లడించారు. ఉపాధ్యాయులు పద్మావతి, వాణి, విజయభాను తదితరులు పాల్గొన్నారు.